క్లుప్తంగా

పరివార దేవుళ్లకు ప్రత్యేక పూజలు



వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్రస్వామికి మంగళవారం దేవస్థానంఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి, నందీశ్వరుడికి పంచామృతాలతో అభిషేకాధి అర్చనలు గావించారు.ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజ చేశారు. అనంతరం నందీశ్వర స్వామికి నూతన వస్త్ర సమర్పణ విశేషార్చనల పూజలను జరిపించారు. చివరిగా నానబెట్టిన శనగలను బసవన్నకు నైవేద్యంగా సమర్పించారు.

కుమారస్వామికి పూజలు



సుబ్రహ్మణ్య స్వామికి అభిషేక పూజల్లో పాల్గొన్న ఈఓ లవన్న

శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం,సుబ్రహ్మణ్య అష్టోత్తరము తదితర పూజలు నిర్వహించిన అనంతరం స్తోత్ర పారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక క్రతువును నిర్వహించారు. పూజా కార్యక్రమంలో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న పాల్గొన్నారు.

పట్టణాన్ని అభివృద్ధి చేస్తాం



భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆత్మకూరు మున్సిపల్ వైస్ చైర్మన్ పువ్వాడి దివ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అంజాద్‌అలీ అన్నారు. మంగళవారం పట్టణంలోని 15వ వార్డులో రహదారి పనులకు భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ సీసీరోడ్డుతో పాటు మురుగు కాలువలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నో సంవత్సరాలుగా కప్పలకుంటలో డ్రైనేజీ, సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, తిమోతి, రఫిక్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ కార్యాలయం తనిఖీ



ఐసీడీఎస్ అధికారులతో మాట్లాడుతున్న ఆర్జేడీ పద్మజ

ఆత్మకూరు: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఆర్జేడీ పద్మజ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. గర్భిణి, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేంద్రాన్ని సూపర్‌వైజర్లు తప్పని సరిగా తనిఖీలు చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సూర్యకుమారి, నాగేశ్వరమ్మ, విజయకుమారి, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక భరోసా



కుట్టు శిక్షణా కేంద్రంలో మహిళలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుమిత్రమ్మ

పాములపాడు: మహిళలు స్వయం ఉపాధితో తమ కుటుంబాలకు ఆర్థిక చేయూత కల్పించవచ్చని ఎంపీడీఓ సుమిత్రమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్, అల్లికలు, ఎంబ్రాయిడరీ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. మహిళలతో మాట్లాడారు. కార్యక్రమంలో సేవాభారతి షర్ఫుద్దీన్ అలీ, మహిళలు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- అలగనూరులో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

మిడుతూరు: పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అలగనూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే మొదట జాతిపిత మహాత్మాగాంధీజీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబెడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు.

సమస్యల తక్షణ పరిష్కారానికి ఆదేశం

రోళ్లపాడు, అలగనూరు పరిధిలో విస్తరించిన కృష్ణజింకలు సాగు చేసిన పంటలను నష్టం పరుస్తున్నాయని, నష్టపరచిన పంటలకు అరకొర నష్టపరిహారం అందజేస్తున్నారని రైతులు ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఎస్సీలకు గత ప్రభుత్వాలు పట్టాలు పంపిణీ చేశాయి, కానీ ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వారిపేర్లు నమోదు కాకుండా వేరే వారిపేర్లు నమోదు చేశారని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మా గ్రామంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో ప్రధానంగా డ్రైనేజీ, సీసీ రోడ్డు, ఎస్సీ కాలనీలో నీటి సమస్యతో పాటు పలు సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కారానికి చొరవ చూపాలను అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల సిద్ధారెడ్డి, ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు రమణయ్య శెట్టి, మాజీ సర్పంచ్ లక్ష్మీదేవి, గోపు చంద్రశేఖరరెడ్డి, వెంకటసుబ్బయ్య, తిమ్మాపురం నాగన్న, పేరెడ్డి శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, ఇనాయతుల్లా, సాధిక్, గపూర్, రమేష్, సీతారాముడు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

మిడుతూరు: సీఎం రిలీఫ్ ఫండ్ నిరు పేదలకు వరం లాంటిదని ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. మంగళవారం నాగలూటి గ్రామంలో బాధితుడు చెరుకుచెర్ల గ్రామానికి చెందిన పేరెడ్డి భాస్కర్ రెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.1,25,000 చెక్కు అందజేశారు. అనంతరం నాగలూటిలో మండల ఉపాధ్యక్షుడు నబిరసూల్‌కు చెందిన పాలీష్ బండల ఫ్యాక్టరీని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, సహకార సొసైటీ అధ్యక్షులు నాగ తులసిరెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ మౌలాలి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరు జనార్ధన్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు నాగ స్వామిరెడ్డి, ఫణిభూషన్ రెడ్డి, మిడుతూరు ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి, నాయకులు నాయకులు చంద్రమౌళి, సర్వేశ్వరరెడ్డి, సుంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను అందజేస్తున్న ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

మల్లన్న సన్నిధిలో అనకాపల్లి కలెక్టర్



శ్రీశైల జగద్గురు పీఠాధిపతి నుంచి ఆశీస్సులు తీసుకుంటున్న కలెక్టర్

శ్రీశైలంటెంపుల్: అనకాపల్లి కలెక్టర్ పఠాన్‌శెట్టి రవి సుభాష్ మంగళవారం శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయం వద్దకు విచ్చేసిన కలెక్టర్‌కు ఆలయ అధికారులు, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో వేదపండితులు కలెక్టర్‌కు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అధికారులు స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు. అనంతరం శ్రీశైల జగద్గురు పీఠాధిపతి పండితారాధ్య చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామిజీ ఆశీస్సులు తీసుకున్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించకపోతే చర్యలు

పగిడ్యాల: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవని ఎంఈఓ సుభాన్ హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని తూర్పు నెహ్రూనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కొత్త మెనూ ప్రకారం పులిహోర, టమోట చట్నీ, ఉడకబెట్టిన గుడ్డు పెట్టడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలతో కలిసి భోజనం చేశారు. అనంతరం వారి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. హెచ్‌ఎం పుల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెలవు లేకున్నా సొసైటీకి తాళం



తాళం వేసి ఉన్న జూపాడుబంగ్లాలోని 80బన్నూరు సహకార సొసైటీ కార్యాలయం

జూపాడుబంగ్లా: ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా ఉద్యోగులు విధుల పట్ల అంకితభావంగా వ్యవహరించటం లేదనే విమర్శలున్నాయి. మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో ఉన్న 80బన్నూరు సహకార సొసైటీ కార్యాలయానికి సెలవులేక పోయినా మంగళవారం కార్యాలయానికి తాళం వేశారు. దీంతో రుణాలకోసం, రుణాల చెల్లింపుతో పాటు పలురకాల పనులపై వచ్చిన రైతులు వెనుదిరిగి వెళ్లారు. 80బన్నూరు సహకార సొసైటీకి మంగళవారం ఉన్నతాధికారులు ఎలాంటి సెలవు ప్రకటించలేదు. అయినా సొసైటీ అధికారులు కార్యాలయానికి తాళం వేసి వారికి వారే కార్యాలయానికి సెలవు ప్రకటించుకోవటం గమనార్హం. ఈ విషయంపై సీఈఓ చంద్రశేఖరగౌడుకు ఫోన్‌చేసి వివరణ కోరగా కార్యాలయానికి ఎలాంటి సెలవు లేదన్నారు. నందికొట్కూరు సహకార సొసైటీ బ్యాంకులో పనిచేస్తున్న అధికారులు బదిలీకావటంతో వారికి ఏర్పాటుచేసిన ఫంక్షన్‌కు సిబ్బంది మొత్తం వెళ్లినట్లు తెలిపారు.

నాణ్యమైన విద్యనందించాలి



విద్యార్థుల హాజరుపట్టీని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సుధాకర్ రెడ్డి

కొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యనంచాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఎస్సీకాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఇందులో భాగంగానే ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపట్టిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభివృద్ధిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యాదీవేన, విద్యాకానుక, అమ్మ ఒడి పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణ రెడ్డి , తదితరులు ఉన్నారు.

కొత్తపల్లిలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ

కొత్తపల్లి :మండల కేంద్రంలో శ్రీ తాండవమల్లేశ్వర స్వామి తిరునాల సందర్భంగా ఈనెల 12 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జి.రాజ్‌కుమార్, రవి, అశోక్ మంగళవారం తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి కస్టమ్స్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేల్పుల ఆనంద్‌కుమార్ రూ.20 వేలు, రెండో బహుమతి కొత్తపల్లి మండల అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో రూ.10వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశ రుసుము రూ.500 చెల్లించి 11వ తేదీలోపు జట్ల పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9705783172, 9542548521,7032027674 నంబర్లను సంప్రదించవలెను.

నంది విగ్రహ సుందరీకరణ త్వరలో పూర్తి



నంది విగ్రహం వద్ద సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న శిల్పాకార్తీక్‌రెడ్డి

మహానంది: మహానందిలో ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి సొంత నిధులు రూ.2కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా సుందరీకరణ పనులను త్వరలోనే పూర్తి చేయనున్నట్లు ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి తనయుడు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువ నేత శిల్పా కార్తీక్‌రెడ్డి తెలిపారు. మహానందీశ్వరుడి దర్శనార్థం మంగళవారం మహానందికి వచ్చిన ఆయనకు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ట్రస్టుబోర్డు చైర్మన్ కొమ్మా పాల మహేశ్వరరెడ్డిలు స్వాగతం పలికారు. ఈ మేరకు ఆయన శ్రీకామేశ్వరిదేవి సహిత మహానందీశ్వరస్వామిని దర్శించుకొని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ముఖ ద్వారం ముందు చేపడుతున్న నంది విగ్రహ సుందరీకరణ పనులను పరిశీలించి ఆర్కిటెక్చర్ నిపుణులకు పలు సూచనలు చేశారు. అనంతరం శిల్పాకార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల పాటు ఇక్కడే ఉండి ఆలయ పరిసరాలను తిలకించే విధంగా సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నాగభూపాల్ రెడ్డి, సూర్యనంది దేవస్థానం మాజీ చైర్మన్ సాగేశ్వర రెడ్డి, మహానంది ట్రస్టు బోర్డు మెంబర్ గంగిశెట్టి మల్లికార్జునరావు, గోపవరం సొసైటీ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కుంచెపు శ్రీనివాసులు, కందుల రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలకు తాగునీటి బోరు



బోరు తవ్వకాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ మౌలాలి

మిడుతూరు: మండలపరిధిలోని కడుమూరు ప్రాథమిక పాఠశాల (మెయిన్) లో విద్యార్థులకు తాగునీటి సమస్య ఉండటంతో ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ సహకారంతో నూతన బోరును మంగళవారం వేసినట్లు ఎంఈఓ మౌలాలి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అప్సరున్నీసా తెలిపారు. పాఠశాలకు సంబంధించిన కొంత మొత్తం, ఉపాధ్యాయుల సొంతఖర్చులతో నూతన బోరు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. సర్పంచ్ జీవరత్నం పాఠశాలకు నూతన మోటార్ అందయనున్నట్లు వెల్లడించారు. నూతన బోరుకు దాదాపు రూ. లక్ష రూపాయలు వెచ్చించినట్లు తెలిపారు.

పరిమితికి మించి ఎక్కిస్తే చర్యలు

జూపాడుబంగ్లా(నందికొట్కూరు): ఆటో డ్రైవర్లు సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవని రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మిడుతూరు రోడ్డులో పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను నిలిపి డ్రైవర్‌కు కౌన్సిలింగ్ ఇచ్చారు. కేవలం 6మంది ని ఎక్కించుకొని వెళ్లాల్సిన ఆటోలో 20మంది ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తున్న డ్రైవర్‌ను సీఐ మందలించాడు.

ఫిజియోథెరపీ పరికరాల పంపిణీ

పాములపాడు: దాతల సహకారం మరువలేనిదని ఎంఈఓ బాలాజీనాయక్ అన్నారు. మంగళవారం స్థానిక భవిత సెంటరులో దివ్యాంగ అవసరమైన ఫిజియోథెరపీ పరికరాలను పంపిణీ చేశారు. వీటికి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ యంజె పద్మభూషణ్ సహకారమందించారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటసుబ్బమ్మ, సీఆర్పీలు మల్లికార్జున నాయక్, నాయుడు, ఫిజియోథెరపిస్టు క్రిష్ణప్రియ, ఐఈఆర్టీలు షంషుద్దీన్, రామమూర్తి పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ బైబిల్ తరగతులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలోని తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చిలో చిల్డ్రన్స్ బైబిల్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బూదాల.నాని, వై.పవన్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈనెల 12, 13, 14 తేదీల్లో బైబిల్ కథలు, స్కిట్స్, డ్రాయింగ్, సాంగ్స్, మ్యూజిక్‌షో, పప్పెట్‌షో, మప్పెట్‌షో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సువార్త కూడికలు ఉంటాయన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పాములపాడు: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న గ్రామ వలంటీర్లు, కొత్తగా నియమించబడిన కన్వీనర్ల సమావేశానికి ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ హాజరుకానున్నట్లు ఎమ్మెల్యే పార్టీ కార్యాలయ ప్రతినిధులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని కొత్తపల్లి, పాములపాడు, జూపాడుబంగ్లా, మిడుతూరు మండలాల్లోని గ్రామ వలంటీర్లు, కొత్తగా నియమింపబడిన వైఎస్సార్‌సీపీ సచివాలయం కన్వీనర్లు తప్పని సరిగా హాజరుకావాలన్నారు. సాయంత్రం 3.30 గంటలకు నారాయణరెడ్డి డిగ్రీ కళాశాలలో ఈ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

మహానందిలో నేడు హుండీ కానుకల లెక్కింపు

మహానంది: మహానంది దేవస్థానంలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ట్రస్టు బోర్డు చైర్మన్ కొమ్మా పాల మహేశ్వరరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ కామేశ్వరిదేవి సహిత మహానందీశ్వర, కోదండ రామాలయం, వినాయక నంది, గో సంరక్షణ, అన్నదానం విభాగాల హుండీ కానుకల లెక్కింపు ఉంటుందన్నారు. స్థానిక అభిషేక మండపంలో జరిగే హుండీ కానుకల లెక్కింపుకు సిబ్బంది అందరూ హాజరు కావాలని కోరారు.

వేతనాలు పెంచాలి

ఆత్మకూరు: అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్స్ యూనియన్ నాయకురాలు మంజుల, విజయలక్ష్మి డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు పని భారం అధికమైందన్నారు. అయితే అందుకు సమానమైన వేతనాలు లేవని వాపోయారు. అనంతరం తహసీల్దార్ ప్రతాప్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రజాక్, రంనాయక్, లక్ష్మీదేవి, ప్రియాంక, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాకురాలు హరిత డిమాండ్ చేశారు. కొత్తపల్లిలో తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్‌కు వినతిపత్రం అందించారు.

పాములపాడు: అంగన్‌వాడీలకు రూ.26,000 వేతనం ఇవ్వాలని నియోజవకర్గ ప్రాజెక్టు కార్యదర్శి శివలక్ష్మి కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రత్నరాధికకు వినతి పత్రం అందజేశారు.

జూపాడుబంగ్లా:అంగన్‌వాడీ వర్కర్లకు గ్రాట్యూటి అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్ల మండల అధ్యక్షురాలు వెంకటరమణమ్మ డిమాండ్ చేశారు. జూపాడుబంగ్లా తహసీల్దార్ పుల్లయ్యయాదవ్‌కు వినతి పత్రం అందజేశారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

జూపాడుబంగ్లా(నందికొట్కూరు): సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తెలిపారు. మండలంలోని బ్రాహ్మణకొట్కూరు సచివాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి విధులకు ఆలస్యంగా హాజరవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా విధులు నిర్వర్తిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. సచివాలయ ఉద్యోగులు నిర్ణీత సమయంలో విధులకు హాజరై బయోమెట్రిక్ వేయాలని సూచించారు.

టూటౌన్ ఎస్‌ఐగా గంగయ్య



గంగయ్య

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం టూటౌన్ ఎస్‌ఐగా ఎస్.గంగయ్య యాదవ్ సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. కొద్ది కాలంగా ఖాళీగా ఉన్న టూటౌన్ ఎస్‌ఐ స్థానానికి నంద్యాల తాలూకా పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న గంగయ్య యాదవ్‌ను జిల్లా పోలీస్ అధికారి రఘువీర్ రెడ్డి బదిలీ చేశారు.

క్రీడాకారులకు అభినందన

పగిడ్యాల: నందికొట్కూరు పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలలో ద్వితీయ విజేతగా నిలిచిన పగిడ్యాల క్రికెట్ జట్టును జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్యాల నాగిరెడ్డి అభినందించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద క్రీడాకారులతో కలిసి బాణా సంచా పేల్చి సంబరాలు చేశారు. గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, ఎంపీటీసీలు పగడం గోపాల్, మిద్దె స్వాములు, మాజీ ఎంపీటీసీలు ఖాజబాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

జూపాడుబంగ్లా(నందికొట్కూరు): పట్టణంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్, స్కాలర్స్ పాఠశాలల్లో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు హరిదాసు, రైతు, వ్యవసాయకూలీల డ్రస్సులు వేయించి వారికి సంక్రాంతి ప్రాముఖ్యతను వివరిస్తూ ఆటలు, పాటలు పాడించారు. కార్యక్రమంలో సెయింట్ మేరీస్ పాఠశాల కరస్పాండెంట్ కెన్నడి, నిర్మల, స్కాలర్స్ కరస్పాండెంటు శివప్రసాదు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థిలకు సీనియర్లు స్వాగతం పలికారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల డెవలప్‌మెంట్ కమిటీ కార్యదర్శి గొల్మారు తాతిరెడ్డి మాట్లాడుతూ ఉన్న ఊరిలో అన్ని సౌకర్యాలతో కూడిన కళాశాలను ఉపయోగించుకోవాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో కళాశాలలు అందుబాటులో లేక విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవలసి వస్తుందని తెలిపారు. విద్యార్థులు సాంస్కృతిక కా ర్యక్రమాలను ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.పి.హుస్సేన్‌బాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పని



కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ అన్వరాబేగం

పాములపాడు: జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని ఏపీడీ అన్వరాబేగం అన్నారు. మంగళవారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో ఉపాధి పనుల కింద పంట కాలువల్లో పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం పని చేస్తే రోజుకు రూ.275 వేతనం వస్తుందన్నారు. ఆమె వెంట సీటీఓ స్వాములు, జేఈ రమేష్‌నాయుడు ఉన్నారు.

కొలతల ప్రకారం పనిచేసుకోవాలి

కొత్తపల్లి: ఎన్ఆర్‌ఈజీఎస్ ద్వారా గిరిజన గూడేలలో నిర్వహిస్తున్న పనులను కొలతల ప్రకారం చేసుకోవాలని క్లస్టర్ ఏపీడీ అన్వరాబేగం, ఎంపీడీఓ మేరి సూచించారు. మంగళవారం మండలంలోని భ్రమరాంబ చెంచుగూడెం, పాలెంచెరువు, చదరం పెంట గూడెలలో పర్యటించి పనులను పరిశీలించి ఉపాధికూలీలతో మాట్లాడారు. పనికి చాలా తక్కువ సంఖ్యలో కూలీలు వస్తున్నారని, కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. దీని గిరిజనులు మాకు ఎన్ఆర్ ఈజీఎస్ ద్వారా పనులు వద్దని పాతపద్దతిలోనే పనులు కల్పించాలని కోరారు. ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్, ఐటీడీ టెక్నికల్ అసిస్టెంట్ బషిరున్, ఐటీడీఏ జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పోతన్న పాల్గొన్నారు.

తిరునాలకు ఆలయాలు ముస్తాబు

- తూర్పు, పడమర ప్రాతకోటలో రేపటి నుంచి సంక్రాంతి ఉత్సవాలు
- 14న కల్యాణం, 15న రథోత్సవం





తూర్పు ప్రాతకోటలోని నాగేశ్వరస్వామి దేవాలయం, పడమర ప్రాతకోట దేవాలయం

పగిడ్యాల: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని తూర్పు, పడమర ప్రాతకోట గ్రామాల్లోని నాగేశ్వరస్వామి, కాశీశ్వర, నందీశ్వరస్వామిల తిరునాల బ్రహ్మోత్సవ వేడుకలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఆయకట్టుదారులు దేవాలయ ప్రాంగణంలోని చెత్తచెదారం, పిచ్చి మొక్కలు తొలగించి తేరుకు ఆముదం అంటించే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే పడమర ప్రాతకోట నందీశ్వర స్వామి రథానికి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో రూ. 1.50లక్షల ఖర్చు చేసి మరమ్మతులు చేయిస్తున్నారు. ఆదివారం నుంచే రెండు గ్రామాల్లో మేటి సేవలు, పల్లకీ సేవలు మొదలు పెట్టారు. పడమర ప్రాతకోట దేవాలయం వద్ద ఉయ్యాలలు, బ్రేక్ డ్యాన్స్, జాయింట్ వీల్, తదితర వినోద సంబంధమైన సామగ్రి రావడంతో గ్రామంలో తిరునాల సందడి మొదలైంది.

రేపటి నుంచి మేటి సేవలు

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 12 నుంచి మేటి సేవలు ప్రారంభిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి గుర్రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న నాగేశ్వరస్వామి, కాశీ విశ్వేశ్వరస్వామిలను పెళ్లి కొడుకు అలంకరణ చేసి రాత్రి 12 శిరస్సుల నాగేంద్ర వాహనంపై గ్రామంలో ఊరేగింపు ఉంటుందన్నారు. అలాగే 14న రాత్రి 12.05 గంటలకు స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం అనంతరం ప్రభోత్సవం నిర్వహిస్తామన్నారు. 15న రథోత్సవం, 16న పారువేట ఉత్సవం ఉంటుందని పేర్కొన్నారు. 17న వసంతోత్సవం, సాయంత్రం కోనేటి స్నానం చేయించి పల్లకీ ఉత్సవం నిర్వహిస్తామని వెల్లడించారు. 26న పదహారు రోజుల పండుగతో తిరునాల వేడుకలు ముగుస్తాయని చెప్పారు.